# కాపు నేస్తం.. లబ్ధిదారుల హర్షం

- ఏలూరులో నాలుగో విడత 1,810 మందికి లబ్ధి
- రూ.2.72 కోట్ల ప్రయోజనం

ఏలూరు (టూటౌన్): కాపు, ఒంటరి, తెలగ, బలిజ సామాజిక వర్గాలకు చెందిన మహిళల ఆర్థిక అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కాపు నేస్తం పథకం అమలు చేస్తోంది. తాజాగా కాపు నేస్తం నాలుగో విడత నిధులు విడుదలకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 30న తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపు నేస్తం నాలుగో విడత సొమ్మును విడుదల చేయనున్నారు. అర్హత ఉన్న మహిళల ఖాతాల్లో రూ.15 వేలు చొప్పున జమకానుంది. ఏలూరు నియోజకవర్గం పరిధిలోని మొత్తం 1,810 మందికి రూ.2.72 కోట్ల మేరకు ప్రయోజనం కలుగునుంది. ఏలూరు అర్బన్ పరిధిలోని 1612 మందికి రూ.2.42 కోట్లు, రూరల్ పరిధిలోని 198 మందికి రూ.30 లక్షల మేరకు లబ్ధి చేకూరనుంది. దీంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆనందం వ్యక్తం చేస్తున్న కాపు నేస్తం లబ్ధిదారులు (ఫైల్)

### ఐదేళ్లలో రూ.75 వేల సాయం

కాపు నేస్తం పథకంలో భాగంగా 2020 నుంచి 2024 వరకు ఆయా వర్గాలకు చెందిన 45 నుంచి 60 సంవత్సరాలు వయస్సు ఉన్న మహిళలకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున మొత్తం రూ.75 వేలు అందించనున్నారు. ఇప్పటికే మూడు విడతల్లో రూ.45 వేలు ప్రభుత్వం అందించింది. తాజాగా నాలుగో విడత సొమ్ము లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమకానుంది. దీంతో వరుసగా నాలుగేళ్లల్లో రూ.60 వేలు చొప్పున కాపు నేస్తం ఆర్థిక సాయం ప్రభుత్వం అందించినట్టయింది.

### అర్హులందరికీ వర్తింపు



వైఎస్సార్ కాపు నేస్తం పథకం కాపు, ఒంటరి, తెలగ, బలిజ సామాజిక వర్గాలకు చెందిన 45 నుంచి 60 సంవత్సరాలు వయసు గల ప్రతి మహిళలకూ వర్తింపజేస్తున్నాం. ఈనెల 30న నిడదవోలులో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగో విడత కాపు నేస్తం పథకం నిధులను విడుదల చేయనున్నారు.

– ఎస్.పుష్పలత, ఈడీ, కాపు/బీసీ కార్పొరేషన్, ఏలూరు

### ఆర్థిక భరోసా



కాపు నేస్తం పథకం ద్వారా ఏటా రూ.15 వేలు చొప్పున అందించడంతో మాకు పూర్తి ఆర్థిక భరోసా కలిగింది. చిన్న పాటి అవసరాలకు ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం ఉండటం లేదు. సొంతంగా చిరు వ్యాపారాలు చేసుకునే అవకాశం దక్కింది. కాపు మహిళలకు అండగా ఉంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– పసుపులేటి రమాదేవి, లబ్ధిదారురాలు, 42వ డివిజన్, ఏలూరు

### అక్కరకు వచ్చింది



నాకు ఎవరూ లేరు. ఒంటరినైన నాకు కాపు నేస్తం పథకం వస్తుంది. మా వలంటీర్ భజంగరావు నాతో బ్యాంక్ అక్కౌంట్ ఓపెన్ చేయించడంతో నేరుగా ఖాతాలోకి సొమ్ములు వస్తున్నాయి. నా లాంటి ఒంటరి మహిళలకు ప్రభుత్వ సహకారం మరువలేనిది. కాపు నేస్తం వల్ల నాలాంటి ఎందరో పేదలకు మేలు జరుగుతోంది.

– బొబ్బిలి సత్యవతి, లబ్ధిదారురాలు, చొదిమెళ్ల, ఏలూరు

### సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



కాపు నేస్తం పథకం ద్వారా ఏటా క్రమం తప్పకుండా ఆర్థిక సాయం అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఇప్పటికే మూడు విడతల్లో ఏడాదికి రూ.15 వేలు చొప్పున రూ.45 వేలు ఆర్థిక సాయం అందుకున్నాం. తాజాగా నాలుగో విడతలో నిధులు రానుండటం ఎంతో సంతోషంగా ఉంది. సీఎం జగన్ మేలు మరువలేం.

– సుంకర పుష్పవతి, లబ్ధిదారులు, చొదిమెళ్ల, ఏలూరు

## క్లుప్తంగా

### సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): ఏజెన్సీ సంక్షేమ హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. హాస్టల్స్‌లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. బుట్టాయిగూడెంలో ఎస్టీ బాలుర హాస్టల్ శిథిలావస్థకు చేరడంతో రాత్రి భోజనం చేసిన తర్వాత విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న డిగ్రీ కళాశాలలో పడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోత్, ఏలూరు నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

### అల్పాహారం పంపిణీ

ఏలూరు (టూటౌన్): ఏలూరు అహిలే సున్నతుల్ జమాత్ ఆధ్వర్యంలో స్థానిక కోట దిబ్బలోని దివ్యాంగుల వసతి గృహంలోని బాలికలకు శనివారం అల్పాహారం అందజేశారు. ముఖ్యఅతిథిగా గర్ల్స్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ సమగ్ర శాఖ ఏలూరు జిల్లాకు చెందిన సబిహాసుల్తానా పాల్గొని మాట్లాడారు. ఏలూరు అహిలే సున్నతుల్ జామాత్ సంస్థ నిర్వాహకులను అభినందించారు. సంస్థ ప్రచార కార్యదర్శి ఎండీ ఇక్బాల్, ఉపకార్యదర్శి ఎండీ గాలబ్ ఆలీ, అబు బాయ్, ఖైరుల్లా, ద్రోకం బాబు, ఇక్బాల్, రబ్బాని అమీన్ అన్సారీ, రేష్మ, ధన, సరిత పాల్గొన్నారు.

### జిమ్నాషియం ప్రారంభం



జిమ్నాషియం ను ప్రారంభించిన కలెక్టర్

ఏలూరు(మెట్రో): ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్మించిన జిమ్నాషియంను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ సతీమణి డా.మానస, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, డిఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి, ఆర్డీఓ కె.పెంచల కిషోర్, ఆఫీసర్స్ క్లబ్ సెక్రటరీ ఎంవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. జిమ్నాషియంలో డంబెల్స్ మొదలు ట్రెడ్ మిల్స్ వరకు వివిధ వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ నడక, వ్యాయామంపై కొంత సమయం కేటాయించి ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని సూచించారు. జిమ్నాషియంను అధికారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిమ్నాసియంను నిర్మించిన ఎస్ఎల్‌వీ కన్స్ట్రక్షన్ పి.శ్రీనివాసరాజును కలెక్టర్ అభినందించారు.

## మేకా శేషుబాబు నియామకం పట్ల హర్షం

ఏలూరు (టూటౌన్): తిరుమల తిరుపతి పాలక మండలి సభ్యునిగా మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబును నియమించడం పట్ల రాష్ట్ర బీసీ నాయకులు చప్పిటి గంగాధరరావు, పామర్తి అచ్యుత్ గౌడ్, శంకా బాలయోగి శనివారం ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీగా, జెడ్పీ చైర్మన్‌గా, హెచ్‌డీఎస్ చైర్మన్‌గా పలు సేవలు అందించిన శేషుబాబు మొదటి నుంచీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వెన్నంటి ఉన్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## చెక్కుల అందజేత

ఏలూరు(మెట్రో): మండవల్లి మండలం మండవల్లికి చెందిన తేరా కుమార్ కడప సెంట్రల్ జైల్లో శిక్షను అనుభవిస్తూ మరణించారు. దీంతో ఆయన కుటుంబానికి న్యాయ పరంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.4 లక్షలు మంజూరు చేసింది. కుమార్ భార్య కూడా మరణించారు. ఈ నేపథ్యంలో ఆయన కుమారులు అఖిల్ దత్, నిఖిల్ దత్‌లు చెరో రూ.2 లక్షలు చొప్పున చెక్కులను శనివారం ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో జేసీ బి.లావణ్యవేణి అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఏవీఎస్ఎస్ మూర్తి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు తెలుగు భాషా సంబరాలు

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏలూరు వైఎంహెచ్‌ఏ హాలులో ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం సంబరాలు, కవిసమ్మేళనం నిర్వహిస్తున్నట్టు సంస్థ చైర్మన్ కత్తిమండ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనం 123వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంగా నమోదు కానున్నట్టు పేర్కొన్నారు. ఏలూరు నగర వీధుల్లో తెలుగు భాష దినోత్సవ సంబరాలు పేరుతో ప్రాచీన కవుల వేషధారణలతో ప్రత్యేక ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

# థెరిస్సా ఆశయ సాధనకు కృషి చేయాలి

ఏలూరు (మెట్రో): మదర్ థెరిస్సా ఆశయ సాధనతో ముందుకు సాగాలని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి అన్నారు. జిల్లాలోని కామవరపుకోటలో పలు సహాయ కార్యక్రమాలు చేపట్టిన వీరమల్ల మధు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ లోగోను జేసీ లావణ్య వేణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లావణ్యవేణి మాట్లాడుతూ మదర్ థెరిస్సా జయంతి రోజున ఏర్పాటు చేయబడిన సహాయ ఫౌండేషన్ కష్టంలో ఉన్న వారిని ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని సూచించారు. కోవిడ్ సమయం నుంచి పలు సహాయ కార్యక్రమాలు చేసిన మధు అండ్ టీమ్ సభ్యుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సి వాయిస్ సీఈఓ లింగుస్వామి, సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు తమ్మిశెట్టి సత్యనారాయణ, గౌరవ సలహాదారులు టీవీఎస్ రాజు, వీరమల్ల మధు, నీజాపరపు దుర్గాప్రసాద్ మున్నంగి శ్రీనివాస్, గోరికల వెంకటేశ్వరరావు, పందూరు రామ సాయి, వీరమల్ల నితిన్ సాయి, సౌజన్ సాయి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఫౌండేషన్ ట్రస్టు లోగోను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి



హమాలీ కాలనీలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మదర్ థెరిస్సా ట్రస్టు సభ్యులు

### మదర్ థెరిస్సా ఆదర్శనీయురాలు

ఏలూరు (టూటౌన్): పేదలకు విద్య, ఆరోగ్యం వంటి అంశాలలో గొప్ప సేవ చేసిన మదర్ థెరిస్సా ఆదర్శనీయురాలని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. భారత రత్న మదర్ థెరిస్సా 113వ జయంతిని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ విక్షణ కేంద్రం విద్యార్థులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో శనివారం నిర్వహించారు. థెరిస్సా చిత్రపటానికి కంప్యూటర్ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. కె.పద్మావతి, ఎం.సాయిచ,జి.గణేష్, యు.దొరబాబు, జె.సునీత,సిహెచ్ అనూష తదితరులు పాల్గొన్నారు.

- మదర్ థెరిస్సా మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కోడేలు హమాలీ కాలనీలో, ఆశ్రమంలో వస్త్రదానం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ చైర్మన్ సీహెచ్ స్వామి, మేతర అజయ్ బాబు పాల్గొన్నారు.

## స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సమీక్ష

దెందులూరు: నియోజకవర్గంలో భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు బీఎల్‌ఓల విధి నిర్వహణ, మండల అధికారుల పర్యవేక్షణ అంకితభావంతో పని చేయాలని కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే సత్యనారాయణ అన్నారు. శనివారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని బీఎల్‌ఓలు, తహసీల్దార్లు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 32 | అరటి కాయ (1) | 07-10 |
| వంకాయలు (గులాబీ) | 24 | చిక్కుడు కాయలు | 64 |
| వంకాయలు (కాంతులు) | 30 | చామదుంపలు | 42 |
| వంకాయలు (తెలుపు) | 30 | ములక్కాడలు | 05-08 |
| బెండకాయలు | 24 | కంద | 40 |
| పచ్చిమిర్చి | 26 | బీట్‌రూట్ | 36 |
| కాకర కాయలు | 40-44 | కీరా దోస | 36 |
| బీరకాయలు | 40-44 | ఫ్రెంచ్‌బీన్స్ | 72 |
| బీరకాయలు (పందిరి) | 36-48 | అల్లం | 120-220 |
| క్యాబేజీ | 32 | కొత్తిమీర (కట్ట) | 15 |
| క్యారెట్ | 36 | పాలకూర | 10 |
| దొండకాయలు | 36 | చుక్కకూర | 10 |
| బంగాళదుంపలు | 26 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 32 | గోంగూర | 07 |
| గోరుచిక్కుడు | 30 | పుదీనా | 05 |
| దోసకాయలు | 30-46 | బఠాణి | -- |
| ఆనబకాయ (1) | 15-20 | క్యాప్సికమ్ | 64 |
| పొట్లకాయ(1) | 20-25 | చిలకడదుంప | 40 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

### ఏసీ బస్సులు..

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర) | 21.00 | 02 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర) | 21.00 | 40 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 05 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 10 |

### సూపర్ లగ్జరీ

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 04 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 04 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 01 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4804 | 00 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 00 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ | 22.15 | 34820 | 27 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 08.00 | 4794 | రద్దు |
| ఏలూరు - విశాఖపట్నం | 12.00 | 4840 | 00 |
| ఏలూరు -విశాఖపట్నం | 22.00 | 4838 | 00 |
| ఏలూరు -తిరుపతి | 16.00 | 4830 | 16 |

# ప్రపంచీకరణతో చేతి వృత్తులు కనుమరుగు

ఏలూరు (టూటౌన్): ప్రపంచీకరణ పుణ్యమా అని చేతివృత్తుల్లోకి కార్పొరేట్ సంస్థలు ప్రవేశించడంతో చేతి వృత్తులు క్రమేణా కనుమరుగవుతున్నాయని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నూరు భాస్కరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చేతి వృత్తిదారుల జిల్లా శిక్షణా తరగతులు స్థానిక కెనాల్ రోడ్‌లోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న భాస్కరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 1.70 కోట్ల మంది చేతి వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. చేతి వృత్తుల్లోకి ప్రవేశించిన కార్పొరేట్ సంస్థలు కోట్లాది రూపాయల పెట్టుబడులతో ప్రవేశించి అధునాతనమైన యంత్రాల ద్వారా వృత్తిదారుల పొట్ట కొడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ ప్లాన్ నిధులకు చట్ట బద్ధత కల్పించాలని, ప్రతి వృత్తిదారుని కుటుంబానికి 90 శాతం సబ్సిడీతో రూ.2 లక్షలు రుణాలు కార్పొరేషన్ల ద్వారా ఇవ్వాలని కోరారు. వృత్తిదారులకు అధునాతన యంత్రాలు అందజేయాలని, సామాజిక రక్షణ నిధులు కేటాయించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు అధ్యక్షత వహించారు. గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆగొల్ల వెంకట కృష్ణారావు, వివిధ సంఘాల నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, మడక రాజు, తాడిశెట్టి కాటం రాజు, గనిగంటి కోటేశ్వరరావు,కింజంగి రాజు, ఉద్దపల్లి కిషోర్, బి.జగన్నాధరావు, వి.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ భాస్కరయ్య

# హెల్మెట్ ధారణపై అవగాహన

ఏలూరు టౌన్: రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలకు రక్షణ కవచంగా హెల్మెట్ ఉంటుందని, మోటారు సైకిల్‌పై ప్రయాణించేవారు విధిగా హెల్మెట్ ధరించాలని ఏలూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి శ్రీహరి సూచించారు. జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో ఏలూరు ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి ప్రత్యేక శ్రద్ధతో మోటారు సైకిల్‌పై ప్రయాణించేవారికి హెల్మెట్ దారణపై అవగాహన కల్పిస్తున్నారు. శనివారం ఏలూరు జాతీయ రహదారి కలపర్రు టోల్‌ప్లాజా వద్ద ప్రాంతీయ రవాణాశాఖ అధికారి కె.శ్రీహరి వాహన తనిఖీలు చేశారు. వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. అధికారులు కె.విజయరాజు, జి.ప్రసాదరావు, కేవీఎస్ ప్రసాద్, ఏఎంవీఐ స్వామి, నరేంద్ర వాహన తనిఖీలు చేశారు. హెల్మెట్ అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆర్‌టీఓ శ్రీహరి మాట్లాడుతూ జాతీయ రహదారులు, ప్రధాన రోడ్లపై ప్రయాణించేవారు సురక్షిత రీతిలో వాహనాన్ని నడపాలని సూచించారు. మోటారు సైకిళ్లపై ప్రయాణించేవారు అతివేగం, నిర్లక్ష్యంగా నడపకూడదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు.



కలపర్రు టోల్‌ప్లాజా వద్ద హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.1.05 లక్షల విరాళం



దాత శ్రీరామచంద్రమూర్తికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ లక్ష్మణ స్వామి

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తుడు శనివారం రూ.1,05,055 విరాళంగా అందించారు. తెలంగాణ రాష్ట్రం, భద్రాచలంకు చెందిన పేరిశెట్టి వీరవెంకట శ్రీరామచంద్రమూర్తి ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణ స్వామి విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు.

## 220 మద్యం క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం



నిందితులు, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై రామకృష్ణ

ఏలూరు టౌన్: ఏలూరు పడమరవీధి పెదపాడు వంతెన సమీపంలో శనివారం నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 220 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏలూరు వన్‌టౌన్ ఎస్ఐ ఎస్.రామకృష్ణ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ ఆదేశాలతో వన్‌టౌన్ ప్రాంతంలో వాహన తనిఖీలు చేస్తుండగా పెదపాడు మండలం వీరమ్మకుంట గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు, పెద్దిరాజు అనుమానాస్పదంగా ఉండటంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారణ చేయగా, మద్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వారి నుంచి 180 ఎంఎల్ మద్యం బాటిల్స్ 220 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గా గుర్తించి, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.